ప్రజాశక్తి
బుధవారం 26 ఏప్రిల్ 2023
5
కర్నూలు

మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్న అంజిబాబు

మతోన్మాద బిజెపిని

బంగాళాఖాతంలో కలిపేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి - ఆయా ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ ప్రచార భేరి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం కోరారు. మంగళవారం కర్నూలు నగరంలోని జమ్మిచెట్టు ప్రాంతం నుంచి ప్రచార భేరిని ప్రారంభించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు మహ్మద్ షరీఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా గౌస్‌దేశాయి, మనోహర్ మాణిక్యం హాజరయి మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశభక్తి ముసుగులో దేశాన్ని అమ్మేస్తోందని విమర్శించారు. కులం, మతం పేర్లతో తగాదాలను సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని మండిపడ్డారు. మరో వైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ జన్‌ధన్ యోజన స్కీం కింద ఖాతా ఓపెన్ చేసుకోవాలని ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పారని గుర్తు చేశారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేస్తామని, ప్రత్యేక హోదా ఇస్తామని హామీలిచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. రాబోయే కాలంలో వామపక్షాలతో పాటు ఇతర లౌకిక శక్తులను, ప్రజాతంత్ర వాదులను కలుపుకొని బిజెపిని గద్దె దింపి భారతదేశాన్ని బిజెపి కబంధహస్తాల నుంచి కాపాడుకోవాలని కోరారు. సిపిఎం, సిపిఐ జిల్లా, నగర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)** నగరంలోని 33వ వార్డు పాత కల్లూరు, చెంచు నగర్, ఊరవాకిలి, కురువ గేరి, ఇందిరమ్మ కట్ట, జానకి నగర్, మహాత్మ నగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప మాట్లాడారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా దేశంలో ఏ రంగంలో కూడా అభివృద్ధి సాధించలేదని మండిపడ్డారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని నిరుద్యోగం పెరిగి ఆర్థిక అసమానతలు పెరిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదాని, అంబానీ లాంటి బడాపెట్టు బడిదారులకు రాయితీలు ఇచ్చి ప్రభుత్వ రంగాలైన రైల్వే, ఎల్‌ఐసి, బ్యాంకులు, నౌకాయానం, రక్షణ రంగం లాంటి కీలక రంగాలను అప్పజెప్పి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకుందని తెలిపారు. మతతత్వాన్ని పెంచి పోషిస్తూ హిందూ రాజ్యాంగం తయారు చేయడానికి బిజెపి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాశక్తి జి.మధు, సిపిఎం నాయకులు జి.ఏసు, ఎస్.రమణమూర్తి, ఎ.గోవిందు, జె.శ్రీనివాసులు, రోశయ్య, రామచంద్రుడు, రాము, ఐ.రాజు, సూర్యనారాయణ, సిపిఐ నాయకులు రామాంజనేయులు, బాషా, కొండన్న, సాయిరాం పాల్గొన్నారు. అలాగే కల్లూరు మండలంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రామకృష్ణ హాజరయ్యారు. సిపిఎం మండల కార్యదర్శి కె.మధు, మండల కమిటీ సభ్యులు ఎ.కృష్ణ పాల్గొన్నారు.

ప్రచార భేరిలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రాముడు

జమ్మిచెట్టు ప్రాంతం నుంచి ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు

ఉలిందకొండలో మాట్లాడుతున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- అమరావతి జెఎసి ఆధ్వర్యంలో ధర్నా
- సిఐటియు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అమరావతి జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జెఎసి జిల్లా ఛైర్మన్, ప్రధాన కార్యదర్శి గిరి కుమార్ రెడ్డి, కెవై.కృష్ణ ఆధ్వర్యంలో అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి నగరంలోని ధర్నా చౌక్ ముందు కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచుతామని, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీఇచ్చి నాలుగేళ్లు గడిచినా ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను సత్వరమే విడుదల చేయాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, రావాల్సిన డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఎపి జెఎసి అమరావతి నాయకులు నాగరమణయ్య, రవీంద్రారెడ్డి, రామానాయుడు, సులోచనమ్మ, శోభా సువర్ణమ్మ, లోకేశ్వరి, సూరిబాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. అమరావతి జెఎసి నాయకత్వంలో స్థానిక ధర్నా చౌక్‌లో చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు దాని గురించి మాట్లాడిన పరిస్థితి లేదని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, పిఎఫ్, ఈఎస్‌ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో ఇప్పటికే ఆందోళన నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు బుట్టదాఖలవుతున్నాయని విమర్శించారు. అలాగే అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి ఏడాది పూర్తవుతున్నా దాని గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగేంత వరకు ఆందోళనలో సిఐటియు కూడా భాగం పంచుకుంటుందని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బతకన్నా హాజరై సంఘీభావం తెలియజేశారు.

కదం తొక్కుతూ.. ముందుకు సాగుతూ..

- కోసిగి మండలంలో లోకేష్ యువగళం
- మంత్రాలయం నియోజకవర్గంలోకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కోసిగి రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం మంత్రాలయం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఆదోని మండలం పెద్దతుంబళం క్రాస్ విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు లోకేష్‌కు ఘనస్వాగతం పలికారు. మంత్రాలయం నియోజకవర్గం గవిగట్టు, బాపులదొడ్డి క్రాస్, పేకలబెట్ట క్రాస్ మీదుగా కోసిగి వరకు సాగింది. కోసిగి యల్లమ్మ దేవాలయం సమీపంలో భోజన విరామం అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. బాపులదొడ్డి గ్రామస్తులు లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. వాటర్ ట్యాంక్ పగిలిపోవడంతో, నీళ్లు సరిగా రావడం లేదని, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, బియ్యం పంపిణీ సక్రమంగా జరగడం లేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పేకలబెట్ట గ్రామస్తులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని తెలిపారు. పులికనుమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ... పులికనుమ ద్వారా రైతులకు సాగునీరందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోసిగి గ్రామస్తులు లోకేష్‌ను కలిశారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని, వ్యవసాయానికి సాగునీరు కూడా అందడం లేదని లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. కోసిగిలో డిగ్రీ కళాశాల నిర్మించాలని కోరారు. నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రాజు, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో ప్రత్యేక జూనియర్ జ్యుడీషియల్ కోర్టును, ఇండోర్ స్టేడియం, నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పులికనుమ నుంచి కోసిగికి సాగు, తాగు నీందించాలని న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. బహిరంగ సభ తర్వాత కోసిగి ఎల్లమ్మ దేవాలయంలో లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోసిగి పురవీధుల్లో పాదయాత్ర సాగింది. లోకేష్‌ను చూసేందుకు జనం రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. కోసిగి శివారు విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పి.తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటి.నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు ఉలిగయ్య, ముత్తురెడ్డి, జ్ఞానేష్, దివాకర్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, సాయిబాబా, చెన్న బసప్ప పాల్గొన్నారు.

బాల నాగు కాదు..విష నాగు..

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కాదని, ఆయన విషనాగు అని లోకేష్ తెలిపారు. కోసిగి బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే, ఆయన అన్న కొడుకు మంత్రాలయాన్ని పంచుకుని దోచుకుంటున్నారని తెలిపారు. ఇసుక రీచుల్లో ఇసుక కర్ణాటకకు తరలిస్తున్నారని, బియ్యం కర్ణాటకకు తరలించి మద్యం అక్కడి నుంచి ఎపికి తరలిస్తున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఆర్‌డిఎస్ కుడికాలువ, కోసిగి ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేస్తామని హామీఇచ్చారు. నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే బాల నాగిరెడ్డికి ఇసుక, అక్రమ మద్యం, మట్కా, ల్యాండ్ కబ్జాలపైన ఉన్న దృష్టి నియోజకవర్గ అభివృద్ధిపై లేదన్నారు.

ఇటువంటి మంచిపని ఒక్కటైనా చేశావా జగన్..?

పాదయాత్రలో నడుస్తూ గవిగట్టు శివార్లలో పులికనుమ బ్రాంచి కెనాల్ వద్ద లోకేష్ సెల్ఫీ తీసుకున్నారు. కరువు సీమలో సాగు, తాగునీరు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడిన కష్టం అడుగడుగునా సాక్షాత్కరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాయలసీమ ప్రజల కళ్లలో ఆనందం చూసేలా ఒక్క పనైనా చేశావా జగన్మోహన్ రెడ్డీ? అంటూ లోకేష్ ప్రశ్నించారు.

సభపై నుంచి అభివాదం చేస్తున్న లోకేష్

అభివాదం చేస్తున్న లోకేష్

మహిళలతో మాట్లాడుతున్న నారా లోకేష్

వ్యవసాయకూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం నాయకులు

ఉపాధి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

కూలీలకు పనిముట్లు అందజేయాలి -ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లు మండలం లొద్ది పల్లె గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, డివైఎఫ్ఐ నాయకులు మహేష్ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు రామస్వామిలు పరిశీలించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు గతంలో రెండు వారాలకు ఒకసారి కూలి డబ్బులు ఇచ్చేవారని ఇప్పుడు 8 , 10 వారాలైనా కూలి డబ్బులు రావడం లేదన్నారు. పనిముట్లు పార శలిక మెడికల్ కిట్స్ గత ఐదు సంవత్సరాలుగా ఇవ్వలేదని కూలీలు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం రూ.90 వేల కోట్లు ఉన్న నిధులు ఈ సంవత్సరం రూ.30 వేల కోట్లకు తగ్గించిందని విమర్శించారు. కూలీలను పొమ్మనలేక పొగ పెట్టినట్టు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని సంవత్సరానికి రూ.లక్ష కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రతికూలికి పారా సలికే గంప ఇవ్వాలన్నారు. లేనిచో కేంద్ర ప్రభుత్వ విధానాల పైన వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎ నరేష్,ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

మండల వ్యవసాయాధికారి అక్బర్ బాషా

ప్రజాశక్తి -వెల్దుర్తి : మండలంలోని గోవర్ధనగిరి రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి అక్బర్ బాషా మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో ప్రతి పంట విత్తుకు అనుకూల సమయం కాదని పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు పైబడి ఉన్నందువల్ల ఈ నెలలో పత్తి సాగుకు అనుకూలము కాదని వాతావరణం చల్లబడిన తరువాత సరైన సమయములో రైతులు విత్తుకోవాలన్నారు. రైతు సోదరులు ఏప్రిల్ , మే నెలలో తొలకరి వర్షాలకు లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. ఈ నెలలో ప్రత్తి పంట సాగు చేయడానికి అనుకూల సమయము కాదని రైతులకు అవగాహన కల్పించాలని రైతు భరోసా సిబ్బందిని ఆదేశించారు.

శ్మశాన స్థలం కోసం...

మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన

- నాలుగు రోడ్ల వద్ద బైఠాయింపు
- బి.అగ్రహారంలో స్తంభించిన రాకపోకలు
- ఎట్టకేలకు సమస్య సద్దుమణిగించిన అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద శ్మశాన స్థలం కోసం గ్రామస్తులు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి గ్రామం నుంచి రాకపోకలను అడ్డుకున్నారు. సోమవారం రాత్రి నుంచి నిరసన చేపడుతూ ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం అధికారులు వచ్చి సర్ది చెప్పి అంత్యక్రియలు నిర్వహించేలా చేశారు.

మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో శ్మశాన స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన దళిత యువకుడు మృతి చెందడంతో సమస్య తలెత్తింది. అధికారులు గ్రామంలోని సర్వే నెంబర్ 244లో 40 సెంట్ల స్థలాన్ని దళితుల శ్మశాన వాటిక కోసం కేటాయించారు. గ్రామంలో బీసీలు, ఇతర కులాల వారికి కూడా శ్మశాన భూమి కొరత ఉంది. దళితులకు చూపిన శ్మశాన స్థలం పక్కనే మిగిలిన ప్రభుత్వ భూమిని బీసీలతోపాటు ఇతర కులాల వారికి శ్మశాన స్థలాన్ని కేటాయించాలని గత కొద్దిరోజులుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం గ్రామంలోని మారెమ్మ అనే మహిళ మృతి చెందారు. అధికారులు దళితులకు చూపిన శ్మశాన స్థలం పక్కనే మిగిలిన స్థలంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. పక్కనే ఉన్న పొలం యజమాని ఆ స్థలం తనదని తమ స్థలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు వీలు లేదని అడ్డుకోవడంతో వివాదం తలెత్తింది. గ్రామస్తులు బోయ మారెమ్మ మృతదేహాన్ని నాలుగు రోడ్ల కూడలి వద్ద నడిరోడ్డుపై ఉంచి గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలను దిగ్బంధించి సోమవారం రాత్రి నుంచి నిరసనకు దిగారు. వీరికి మద్దతుగా వాల్మీకి సంఘం నాయకులు విజిఆర్.కొండయ్య, యాపిలయ్య, మురళీ నాయుడు, ఎల్ఐసి రంగస్వామి, గాజులదిన్నె నాగరాజు, రాజ్ కుమార్ నాయుడు గ్రామానికి చేరుకుని సమస్య పరిష్కరించేంత వరకు అక్కడే బైఠాయించారు.

సమస్య సద్దుమణిగించిన అధికారులు

ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి, గోనెగండ్ల తహశీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ తిమ్మారెడ్డి సచివాలయ రెవెన్యూ సిబ్బందితో మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో శ్మశాన స్థలం కొరత ఉందని, గ్రామ పంచాయతీ తీర్మానం చేసుకొని జిల్లా పంచాయతీ అధికారి ద్వారా తమను సంప్రదిస్తే స్థలం కేటాయిస్తామని సర్ది చెప్పారు. ప్రస్తుతానికి గుర్తించిన ప్రభుత్వ భూమిలోనే మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని నచ్చజెప్పి అంత్యక్రియలు పూర్తి చేయించి సమస్యను సద్దుమణిగించారు.

సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

గ్రామస్తులు మాట్లాడుతూ... ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించినప్పటికీ గ్రామంలో మళ్లీ ఎవరైనా మృతి చెందినప్పుడు సమస్య పునరావృతమయ్యే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు ప్రభుత్వ మిగులు భూమిలో గ్రామానికి శ్మశాన స్థలాన్ని కేటాయించి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

రోడ్డు మధ్యలో ఉంచిన మృతదేహం

గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రకృతి వ్యవసాయ సాగుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో రైతుల ప్రకృతి వ్యవసాయ సాగుపై దృష్టి సారించేలా తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వ్యవసాయ , ఇతర అనుబంధ శాఖల పై సమీక్ష చేశారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగపడేలా ఉండాలని ప్రభుత్వ ఉద్దేశ్యమని, ఆ ఉద్దేశ్యం నెరవేరేలా రైతు భరోసా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు కొన్న రైతులు నష్టపోయి ఇబ్బంది పడుతున్నందున, ఈ ఏడాది నకిలీ విత్తనాలు విక్రయాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం కింద నిర్దేశించిన గడువు లోపల క్లస్టర్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు ప్రభుత్వం తరపున యంత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పొలంబడి కార్యక్రమాల ద్వారా నూతన సాగు పద్ధతులు, తగిన సాంకేతిక విధానాల గురించి రైతులకు వివరించాలన్నారు. క్రమేపీ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు వచ్చే విధంగా రైతులను చైతన్య వంతులను చేయాలన్నారు. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో ఎన్ని ఎకరాలలో పంట సాగు అయింది, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, తదితర కార్యక్రమాల వివరాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాడి పరిశ్రమ దిశగా ప్రోత్సహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లైవ్ స్టాక్, వాక్సినేషన్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఉద్యాన శాఖకు సంబంధించి జిల్లాలో ఉద్యాన శాఖ విస్తీర్ణం మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. సమీక్షలో వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రయ్య, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మత్స్య శాఖ అధికారి శ్యామల, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ షర్మిల, మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణ మూర్తి, మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు, డిసిఐ రామాంజనేయులు, ఎపి సీడ్స్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా క్రికెట్ బెట్టింగ్

- తీవ్రంగా నష్టపోవడంతో ఊరు వదిలే పరిస్థితి - చేతులు మారుతున్న రూ.లక్షలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రశాంతంగా ఉన్న పల్లె వాతావరణంలో క్రికెట్ బెట్టింగ్ మాఫియా చిచ్చు రేపుతోంది. చిన్నా, చితకా మ్యాచ్‌లకు తోడు ఐపిఎల్, దేశవాళీ క్రికెట్ టోర్నీ, ప్రపంచంలో ఏ ఒక్క క్రికెట్ మ్యాచ్ జరిగినా దానిపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తుండడం విశేషం. క్రికెట్‌కు జెంటిల్‌మెన్ ఆటగా పేరుంది. అంతటి గౌరవప్రదమైన క్రీడను బెట్టింగ్ రాయుళు సొమ్ముగా మలచుకుంటున్నారు. కొద్దిపాటి సొమ్ముతో లాభాలు వస్తాయనే ఆశతో.. యువత క్రికెట్ బుకీల చేతుల్లో చిక్కి బలవుతున్నారు. ప్రస్తుతం అంతటా ఐపిఎల్ ఫీవర్ పట్టుకుంది. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన క్రికెట్ జూదం ఇప్పుడు పల్లెలకూ పాకింది. ఈ జూద క్రీడలు మధ్య తరగతి కుటుంబాల్లో చిచ్చుపెడుతున్నాయి. క్రికెట్ బెట్టింగ్ చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. ఈ మాఫియా ఊబిలో దిగి సర్వస్వాన్ని కోల్పోయి తల్లిదండ్రులకు భారం అవుతున్నారు. ప్రతి మ్యాచ్‌లోనూ ప్రతి బంతికి, ప్రతి పరుగుకు బెట్టింగ్ నిర్వహిస్తూ భారీ మొత్తంలో మూల్యం చెల్లించుకుంటున్నారు. బెట్టింగ్ మోజులో పడి ఎక్కడ పడితే అక్కడ అప్పులు చేసి యువత చివరకు రోడ్డున పడే పరిస్థితి దాపురిస్తోంది. పోలీసు వ్యవస్థ ద్వారా పెద్ద స్థాయిలో నిఘా ఉన్నా వారికి చిక్కకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. పలు వెబ్ సైట్ల ద్వారా సీక్రెట్‌గా బెట్టింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రతి మండల కేంద్రాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఎవరికీ అనుమానం రాకుండా మొబైల్ ఫోన్ల ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ ఐపిఎల్ సీజన్‌లో గ్రామీణ యువత చేతుల్లో రూ.లక్షలు మారినట్లు సమాచారం. బెట్టింగ్‌కు పాల్పడి నష్టపోవడంతో కుటుంబ సభ్యులకు ఏం చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో అప్పుల పాలై గ్రామాలను విడిచి వలస వెళ్లే పరిస్థితి దాపురిస్తోంది. దీనికి తోడు తల్లిదండ్రులను వేధిస్తూ అందినకాడికి తీసుకెళ్తూ ఈ బెట్టింగ్ మాఫియాకు బలవుతున్నారు.

బానిసలవుతున్న యువత

యువతకు బెట్టింగ్ వ్యసనంగా మారింది. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఇంట్లో కూర్చొనే ఆడుకుంటున్నారు. మనీ వాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులోకి బ్యాంకు ఖాతా, ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌ల్లో రిజిస్ట్రేషన్ అయిన ప్రధాన బుకీలు.. వాటిని సబ్ బుకీలు, ఏజెంట్లకు అప్పగించి తెర వెనుక నుంచి వ్యవహారం నడిపిస్తున్నారు. ప్రయివేట్ ఉద్యోగులు, చిన్నపాటి వ్యాపారులు, విద్యార్థులు సరదాగా పందేలు కాస్తూ బానిసలవుతున్నారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి రావడంతో ప్రధాన బుకీలు, ఫంటర్లు ఎవరనేది గుర్తించడం సవాలుగా మారింది. ఇదే అదనుగా యాప్‌లో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన బుకీలు వాటిని ఇతరులకు అప్పగించి తెరవెనుక నుంచి వ్యవహారం నడిపిస్తున్నారు.

పట్టణం నుంచి పల్లెల్లోకి

ఐపిఎల్ ప్రారంభమైందంటే చాలు ఆదోని పట్టణంతోపాటు పెద్దతుంబలం, పెద్దహరివాణం, మండగిరి గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్ భూతం పడగవిప్పుతుంది. ప్రధానంగా పట్టణాల్లో లాడ్జిలలో, గ్రామాల్లో ఊరి చివర ఉన్న పొలాల్లో తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోంది. క్రికెట్ మ్యాచ్ ప్రారంభం నుంచి యాప్‌లో లైవ్ చూస్తూ పందేలు కాయిస్తున్నారు. సిక్సర్లు, బౌండరీలు, వికెట్లు, మ్యాచ్ గెలుపోటములు ప్రతి అంశంపై పోటీ పడుతూ మరీ పందేలు కాస్తుండడం విశేషం. సంబంధిత అధికారులు స్పందించి బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై నిఘా వేస్తే వీరి గుట్టు బయటపడే అవకాశముంది.

బిజెపిని సాగనంపి..

దేశాన్ని కాపాడుకుందాం...

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కేంద్రంలోని బిజెపిని ఇంటికి సాగనంపి, దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. మంగళవారం సిపిఎం, సిపిఐ ప్రచార భేరి రంగాపురం గ్రామంలో సాగింది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు మబ్బు ఆంజనేయ, సిఐటియు మండల కార్యదర్శి ఉప్పర ఈరన్న మాట్లాడారు. రంగాపురం గ్రామంలో డ్రెయినేజీలను వెంటనే శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. రంగాపురం అయ్యప్ప, నాగేంద్ర, పెద్ద అయ్యన్న, తారాపురం గిడ్డయ్య, మునెప్ప, రమేష్, ఆంజనేయ, నరసప్ప పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని కె.వెంకటాపురం, పల్లెదొడ్డి, గద్దెరాళ్ల గ్రామాల్లో ప్రచార భేరి నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరశేఖర్, ఎమ్.నరసరావు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ ఆపాలని, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ, సిపిఎం మండల నాయకులు సూరి, శ్రీనివాసులు, రవి రాజు, నగేష్ పాల్గొన్నారు.

పెద్దకడబూరులో...

జగన్ వైపే ప్రజలు మొగ్గు

- మెగా పీపుల్స్ సర్వేకు వస్తున్న స్పందనతో ప్రతిపక్షాల గుండెల్లో దడ

- వైసిపి రాష్ట్ర యువనేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా ఆకర్షక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి వైపు అడుగులు వేయిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన లభించిందని తెలిపారు. నియోజకవర్గంలోని 60 వేల కుటుంబాలను కలిసినట్లు చెప్పారు. ఈనెల 7న 'జగనన్నే మా భవిష్యత్తు' మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటినీ సందర్శించి సంక్షేమ పథకాల అమలు తీరుపై అభిప్రాయాలను సేకరించినట్లు చెప్పారు. ఈ సర్వేలో తొలి 15 రోజుల్లో కోటి కుటుంబాలను పూర్తి చేయగా 79 లక్షల మిస్డ్ కాల్స్‌తో మద్దతు తెలిపారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో ప్రజలు సైతం జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. సర్వేకు వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాల గుండెల్లో దడ మొదలైందని చెప్పారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, పెద్దకడబూరు మండల అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, వైసిపి సేవాదళ్ నాయకులు లక్ష్మి నారాయణ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు రవి చంద్ర రెడ్డి, గజేంద్ర రెడ్డి, జనార్ధన్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, దేవదానం, పరమేష్, ఈరన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు...

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి
- ఏడుగురు సచివాలయ ఉద్యోగులకు మెమోలు

ప్రజాశక్తి - ఆదోని

సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సచివాలయ ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో 5, 6 వార్డుల సచివాలయాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు తప్పనిసరిగా సచివాలయంలో స్పందన నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, సమయపాలన పాటించని ఏడుగురు సచివాలయ ఉద్యోగులకు చార్జ్ మెమోలు జారీ చేశామని చెప్పారు. 5వ సచివాలయంలో ముగ్గురు, 6వ వార్డు సచివాలయంలో నలుగురు సెక్రటరీలకు శాఖపరమైన చర్యలు ఎందుకు తీసుకోరాదు సంజాయిషీ ఇవ్వాలని నోటీసు జారీ చేశామన్నారు. రోజువారీగా సర్వీసులు పెంచాలని, ఆస్తి పన్ను, తాగునీటి పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలని సూచించామని తెలిపారు. రోజువారీగా సచివాలయాలను తనిఖీ చేస్తామని, తాము వెళ్లినప్పుడు గైర్హాజరయితే చర్యలు తప్పవని ఉద్యోగులకు హెచ్చరికలు జారీ చేశారు.

రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

'యువగళం' ఆదరణను చూసి వైసిపి బెంబేలు

- వ్యక్తిగత విమర్శలు రాజకీయ దిగజారుడే
- లోకేష్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు
- టిడిపి సీనియర్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

యువగళం పాదయాత్రకు వస్తున్న జనాదరణను చూసి అధికార పార్టీ నాయకులు బెంబేలెత్తుతున్నారని టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి, ఎల్ఎల్‌సి మాజీ ఛైర్మన్ బసాపురం రామస్వామి, ఆత్మ మాజీ ఛైర్మన్ ఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం సిటీ ప్రెస్ కాంపౌండ్‌లోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి 'రాసలీలలు' అంటూ వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగదని మండిపడ్డారు. సోషల్ మీడియాలో లోకేష్ రాసలీలపై ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు హల్‌చల్ చేయడంపై తాము స్పందించినట్లు తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర విజయవంతంగా జరిగిందని, సహకరించిన నియోజకవర్గ ప్రజలకు, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో లోకేష్ ఏమైనా అక్రమాలు చేసి ఉంటే వాటిపై ఆధారాలు చూపిస్తూ విమర్శలు చేయాలే తప్ప ఇలా వ్యక్తిగతంగా విమర్శలు చేయడం రాజకీయ దిగుజారుడేనని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు ఉమాపతి నాయుడు అక్రమాలు చేసినట్లు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని తెలిపారు. అసలు అక్రమాలు చేసింది ఎవరు, అన్యాయాలు చేసింది ఎవరో, భూ కబ్జాలు చేసింది ఎవరో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. లోకేష్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. భూకబ్జాలు అంటే క్యాష్ ప్రసాద్ రెడ్డి అని తెలిపారు. లోకేష్ పాదయాత్రకు విశేష స్పందన లభిస్తే ఎమ్మెల్యే, ఆయన తనయుడు మనోజ్ కుమార్ రెడ్డిలు జనమే రాలేదని చెప్పడం తగదన్నారు. ఇసుక వేస్తే రాలనంత జనం వచ్చారని, దుకాణాలు అంతా బంద్ చేసుకొని చూడడానికి జనం వస్తే జనాదరణ చూసి వైసిపి నాయకులు భయపడుతున్నారన్నారు. ఆదోనిలో టిడిపిలో ఎవరైనా అక్రమాలు చేస్తే మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుపై ఆరోపణలు వస్తాయని, అలాగే వైసిపిలో ఎవరైనా అక్రమాలు చేస్తే ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై ఆరోపణలు రావడం సహజమని తెలిపారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా ఉంటామని, ప్రతి విమర్శనూ ఎదుర్కొంటామని చెప్పారు. నాయకులు షేక్షావలీ, కారుమంచప్ప, రాముడు ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి

వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ప్రత్యర్థులు

పడగ విప్పిన పాత కక్షలు

- కలపర్రి దగ్గర వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండలం కలపర్రి దగ్గర పాత కక్షలతో కారుమంచి గ్రామానికి చెందిన బోయ హనుమంతు (48)ను మంగళవారం ప్రత్యర్థులు హత్య చేశారు. పోలీసులు, బంధువుల వివరాల మేరకు... కారుమంచి గ్రామానికి చెందిన హనుమంతు గత కొంత కాలంగా దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఆస్పరి మండలం బైలు పత్తికొండ గ్రామంలో తమ బంధువులు చేసిన దేవర కార్యక్రమాలు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రత్యర్థులు కాపుకాసి దాడి చేశారు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 2008 సంత్సరంలో కారుమంచి గ్రామంలో చెన్నయ్య హత్య కేసులో హనుమంతు ప్రధాన నిందితుడు. హత్యకు ప్రతీకారంగా హనుమంతును చంపినట్లు సమాచారం.

జిల్లాస్థాయిలో 1వ ర్యాంకు సాధించిన మేఘన

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న మంగలి మేఘన మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి జిల్లాస్థాయి 1వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ముజ్బుర్ రహ్మాన్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. పాఠశాలకు చెందిన ఉషారాణి 16వ ర్యాంకు, నానిజ 98వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో ప్రవేశంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

అంత్యక్రియలకు చోటు చూపండి

- ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

మృతదేహం అంత్యక్రియలకు స్థలం చూపాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోనెగండ్ల మండలం అగ్రహారంలో శ్మశానానికి స్థలం లేక బోయ మారెమ్మ మృతదేహంతో బంధువులు ధర్నాకు, రహదారి దిగ్బంధనానికి దిగాల్సిన పరిస్థితి ఏర్పడడం బాధాకరమన్నారు. ఏ గ్రామంలో కూడా అగ్రహారం ఘటన పునరావృతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచి నీలకంఠ

ప్రజాశక్తి - చిప్పగిరి

గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్యపరంగా ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్న పరీక్షల వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి నీలకంఠ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన సూచించారు. మంగళవారం డేగలహాల్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రక్తహీనతకు గురికాకుండా బలవర్ధకమైన ఆహారం అందిస్తోందని తెలిపారు. ఆరోగ్యపరంగా ఎప్పటికప్పుడు విలేజ్ వైద్యాధికారి చేత ఆరోగ్య సూచనలు పాటించేలా చూస్తోందన్నారు. ప్రసవం అయ్యేంత వరకు వైద్యాధికారి సూచనలు పాటించాలని మహిళలకు తెలిపారు. అంగన్వాడీ టీచర్ భారతి, ఆయా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పాఠశాలకు నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎలప్ప, ఎపిటిఎఫ్ నాయకులు జి.ప్రసాద్ మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందని, పాఠశాల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను నిందించడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్లతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేయడం సమస్యలకు పరిష్కారం కాదని చెబుతూనే సస్పెన్షన్ చేస్తున్నారని తెలిపారు. విద్యాసంబంధ విషయాల్లో లోపాలను గుర్తించినప్పుడు వాటిని ఉన్నతాధికారిగా సరిదిద్దాలని, వైఫల్యమంతా ఉపాధ్యాయులదే అన్నట్లుగా ప్రవీణ్ ప్రకాష్ తీరు ఉందని పేర్కొన్నారు. నాడు-నేడు పనులు పాఠశాలలో విలీనం, పదోన్నతులు, వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేశారని తెలిపారు. రకరకాల యాప్‌ల భారాన్ని ఉపాధ్యాయులపై మోపి పాఠాలు చెప్పలేని పరిస్థితిని కల్పించారని చెప్పారు. ఇప్పుడు విద్యా సంవత్సరం చివరలో తనిఖీలంటూ హడావుడి ఎందుకో అర్థం కాని పరిస్థితి ఉందని తెలిపారు. ఇదే కొనసాగితే వచ్చే విద్యా సంవత్సరంలో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం కోల్పోయి వారి పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపించే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. మొత్తం విద్యా వ్యవస్థను ప్రయివేట్ పరం చేయడానికి పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విధానాన్ని మార్చుకోకపోతే ఉపాధ్యాయ లోకాన్ని ఒత్తిడి నుంచి కాపాడుకోవడం కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు రామలింగప్ప, రాముడు, శాంతమూర్తి, ఈరన్న, విజయలక్ష్మి, సూర్యనారాయణ శెట్టి, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మద్దయ్య, ధర్మన్న, లక్ష్మీ కళ, ప్రమీల, రంగమ్మ, నాగరాజు పాల్గొన్నారు. అలాగే ఫ్యాప్టో తాలూకా కన్వీనర్, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కరెకృష్ణ ఆధ్వర్యంలో గుడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు విధులకు హాజరై నిరసన తెలియజేశారు. బిటిఎ రాష్ట్ర కార్యదర్శి మాదన్న, ఫ్యాప్టో బాధ్యులు మహేష్, రాముడు, సాయిబాబు, ఆరన్ జ్యోతి, మారుతి, మన్సూర్ బాష, సతీష్, విజయచంద్ర, నారాయణ, రంగస్వామి, పరమేష్ పాల్గొన్నారు.

ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

'లూజు నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు'

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో లూజు, నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే సీడ్స్ డీలర్ల లైసెన్స్ రద్దు చేసి తగిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ వ్యవసాయ సహాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్, ఎఒ సురేష్ బాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక సిఎల్ఆర్‌సి భవనంలో సీడ్స్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విత్తనాలు అమ్మిన తర్వాత రైతుకు తప్పక రసీదు ఇవ్వాలన్నారు. పత్తి, మిరప విత్తనాలు నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మితే ఆ డీలర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్‌కు విడిగా రసీదు బుక్స్, స్టాక్ రిజిస్టర్లు పెట్టాలని సూచించారు. ఎఇఒ జయరాం, వివిధ గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి

- రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులు మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రభుత్వ వైద్యశాల రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలయ్య, సిద్ధార్థ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బి.వేణుగోపాల చారి తెలిపారు. మంగళవారం సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించారు. 2015-18, 2016-19, 2017-20 సంవత్సరాల్లో సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు కాన్వకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బి.వేణుగోపాల చారి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు వినయ, విధేయత, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని, ఇలాంటి బ్యాచ్‌లు మళ్లీ రావాలని కోరారు. కొంతమంది పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ... సిద్ధార్థ డిగ్రీ కళాశాల తమకు సంస్కారం, వినయ, విధేయతలు, జీవన అభివృద్ధికి విద్యా జ్ఞానాన్ని అందించిందని తెలిపారు. అనంతరం డాక్టర్ బాలయ్య మాట్లాడారు. విద్య ద్వారానే జ్ఞానాన్ని వృద్ధి చేసుకోగలమని, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో విజయం సాధించాలని కోరారు. కాన్వకేషన్ సర్టిఫికెట్లను సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కమల సుజాత, ఎఎస్ డిగ్రీ కళాశాల వెంకట్రామిరెడ్డి, డాక్టర్ బాలయ్య, విజయ మహిళా మండలి డైరెక్టర్ ఓంకారప్ప పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యశాల రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలయ్య

కార్మిక ప్రదర్శన, సదస్సు జయప్రదం చేయండి

- ఎఐఎఫ్‌టియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా భవిష్యత్ కార్మిక పోరాటం కోసం, ఆదోని పరిశ్రమల పునర్జీవనం కోసం ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించే కార్మిక ప్రదర్శన, సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గంగన్న, ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌సిసి కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇక్కడ అన్నీ వ్యవసాయ ధారిత పరిశ్రమలే ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతం వారే కాకుండా వివిధ రాష్ట్రాల ప్రజలు కూడా పనిచేస్తున్నారని చెప్పారు. 1992లో అమలైన ఆర్థిక సంస్కరణల ఫలితంగా పరిశ్రమలన్నీ మూతపడ్డాయన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు ఎఐఎఫ్‌టియు ఎన్నో చారిత్రాత్మక పోరాటాలు చేసిందన్నారు. ఆర్‌సిసి రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్, ఎఐఎఫ్‌టియు నాయకులు వెంకప్ప, బన్ను హుస్సేని, లక్ష్మన్న, బాష, జాను, ఈరప్ప, పిఒడబ్ల్యు అధ్యక్షులు సుజ్ఞానమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

CHANGE OF NAME

By this deed I, the undersinged **MIDDE NIRMALA ASHA JYOTHI PAUL** (NEW NAME), W/o. Midde Ernest Paul Azariah Previsouly called **NARUKURTHI NIRMALA ASHA JYOTHI** (OLD NAME), Resident of H.No. 118, Central Plaza, Kurnool town - 518002. Kurnool District. Andhra Pradesh.

మహారాజశ్రీ కర్నూలు ఆరవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
ఐ. ఏ. నెం.244/2021 ఇన్
ఓ. యస్. నెం.54/2018

బొమ్మిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి.
...వాది/అర్జీదారు

-ఎదురు -

కె.ఖదీర్ అహమ్మద్ తండ్రి మాసుమ్ సాహెబ్,రియల్ ఎస్టేట్, బిజినెస్,ఇంటి. నెంబర్. 87-1201-10ఎ, సోమిశెట్టి నగర్, కర్నూలు. ...ప్రతివాది/రెస్పాండెంటు

రెస్పాండెంట్ /ప్రతి వాదికి ఆర్డర్ 34 రూల్ 5 సి.పి.సి. మరియు సెక్షన్ 151 ప్రకారం నోటీసులు

పై నంబరు దావాలో వాది/అర్జీదారు 30- 12-2019 తేదీన షెడ్యూలు దాఖాలా ఆస్తి పైన పొందిన ప్రిలిమినరీ డిగ్రీని ఫైనల్ డిగ్రీ చేయమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణం ఉన్న 28-4-2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు :-

The open plot No.25 measuring 266.66Sq.yards in Sy.480. Situated in Adithya Nagar near, house bearing. No.80/1176-42A,11th. ward, kallur, Kurnool Municipal Corporation, Kurnool town and District within Kurnool Sub-registration District and Kurnool Registration District and bounded as follows :
East : Land in Sy.No.252/A/3B,
West : Plot. No.26.
North:Plot.No.24.
South : 33 feet road.
Within these boundaries Measuring
East : West : 40 feet or 12.1920 meters,
North : South : 60 feet or 18.2880 meters,
Ad Measuring 2.400 Sq. Feet or 266.66 Sq.yards.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 28-4-2023

ఎ.రామసుబ్బారెడ్డి,
ఎ.ప్రభాకర్ రెడ్డి,
వాది/అర్జీదారు పరం న్యాయవాదులు,
కర్నూలు.

మలేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మోడీ నిరంకుశ పాలనను వ్యతిరేకించండి

- ప్రచార భేరి ముగింపు సభలో వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు కె.ప్రభాకర్ రెడ్డి, కె.రామాంజనేయులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, వేదికపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు తదితరులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, నిరంకుశ పాలనను ప్రజలందరూ వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రామాంజనేయులు పిలుపునిచ్చారు. 'ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనపుదాం-దేశాన్ని కాపాడుకుందాం' నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి ముగింపు సభ మంగళవారం పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో జరిగింది. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి రణధీర్, సిపిఐ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు వేస్తూ లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వారికి దారాదత్తం చేస్తుందని అన్నారు. ఎపి రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు వారికి అప్పనంగా అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఏమాత్రం నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విచ్చలవిడిగా పన్నుల మీద పన్నులు వేస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు, చిన్నారులు ఆలపించిన విప్లవ గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు, మహిళా సమైక్య నాయకురాలు స్వాతి, మహిళా సంఘం నాయకురాలు మంజుల, మిన్నమ్మ, సిపిఎం నాయకులు సి.వెంకటేశ్వర్లు, పి.సుధాకర్, ఎన్.స్వాములు, మాబాషా, సద్దాం, ఇస్మాయిల్, సురేంద్ర, సిపిఐ నాయకులు, అతావుల్లా, ప్రతాప్, వెంకట శివుడు, అహమ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

విప్లవ గేయాలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

మలేరియా నిర్మూలనే లక్ష్యం

- సమీకృత కృషి ద్వారానే సాధ్యం
- డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

2030 నాటికి మలేరియా లేని దేశంగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, అందుకు ప్రజలు, అన్ని శాఖల సమీకృత కృషి ద్వారానే మలేరియా నిర్మూలన సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర ఆర్.వెంకటరమణ అన్నారు. మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి మలేరియా పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా ప్రాణాంతక వ్యాధి అని, ఇది ఆడ అనాఫిలస్ దోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. ప్రజలు రాత్రి వేళ నిద్రించినపుడు దోమ తెరలు ఉపయోగించాలని, ఇంటిలోని తలుపులు, కిటికీలకు దోమలు చొరబడకుండా మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటి పరసరాలలో నీటి నిల్వలను వారానికి ఒకసారి శుభ్రము చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాల ద్వారా ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. కార్యక్రమలో జిల్లా మలేరియా అధికారి వి.కామేశ్వర రావు, జిల్లాలోని ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు వైద్యులు ఓ.ప్రభావతి దేవి, జగదీశ్ చంద్రారెడ్డి, బాలాజి, కాంతారావునాయక్, సునీత, ఏఓ చంద్రశేఖర్, డెమో కె.రవీంద్రనాయక్, జి.వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు. **అవుకు :** మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ప్రాథమిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ టి.వినోద్ కుమార్, డాక్టర్ నవీన్, హెల్త్ సూపర్వైజర్ కమల్ సాహెబ్, వేణుగోపాల్ రాజు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** బైర్లూటిలో ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డా. పవన్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ సోమేశ్వరి, ఉపాధ్యాయులు ఖాజా, సరస్వతి, వార్డెన్ శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఓ రమణమ్మ, సూపర్వైజర్లు రామలింగారెడ్డి, రామ చంద్రుడు, ప్రమీలమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మలేరియా నివారణ ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపేంద్ర నాథ్ రెడ్డి,ఎంపీహెచ్వో విజయ్ రెడ్డి, పిహెచ్ఎన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం
- ఎపి జెఏసి అమరావతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

సంఘీభావం తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రభుత్వం కృషి చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అమరావతి జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్, జిల్లా కార్యదర్శి పి.వెంకట లింగంలు సంఘీభావం తెలిపారు. అనంతరం వి.ఏసురత్నం మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి నాడు ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు ఇస్తామని హామీలిచ్చి నేడు ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు ఇస్తామని, శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి నాలుగేళ్లు పూర్తయినా ఆచరణలో లేదన్నారు. గత 48 రోజులుగా ఉద్యోగులంతా ఆందోళన చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్మోహన్ రెడ్డి అధికారులతో చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేనిపక్షంలో రాబోయే కాలంలో ఉద్యోగులంతా ఐక్యమై వైసిపికి పుట్టగతులు లేకుండా చేస్తారని హెచ్చరించారు. అమరావతి జెఎసి ఆధ్వర్యంలో చేసే ఆందోళనలకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానంపై పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో వక్తలు
- రెండో రోజు పతాకావిష్కరణ, బహిరంగ సభ

ప్రజాశక్తి - డోన్

నూతన జాతీయ విద్యా విధానంపైన విద్యార్థులందరూ కలిసికట్టుగా పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం డోన్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా మూడవ మహాసభ రెండో రోజు కొనసాగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన పతాకావిష్కరణ చేసి సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ సుధా విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుదర్శన్, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షులు నరసింహులు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాణిక్యంశెట్టిలు హాజరై మాట్లాడారు. దేశంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అజెండాను భుజాన పెట్టుకొని మోస్తుందని అన్నారు. అధికారంలోకి రాకముందు విద్యారంగంలో మార్పులు చేస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీలు ఇచ్చి, వాటిని కేవలం హామీలకే పరిమితం చేశారని విమర్శించారు. కానీ ఆర్ఎస్ఎస్ హిందుత్వ అజెండా మాత్రం ముందుకు వెళుతున్న పరిస్థితి దేశంలో నెలకొందని అన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాల్సింది పోయి వాటి నుండి తప్పుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రారంభమైన విద్యా ప్రవేటీకరణ దాని పర్యవసానం ఇప్పుడు బిజెపి ప్రభుత్వంలో విద్య మరింత ప్రైవేటీకరణ, కార్పొరేట్కరణ, కాషాయీకరణ దిశగా పరుగులు పెడుతుందని తెలిపారు. అందులో భాగంగా బిజెపి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం-2020 వల్ల పేదవాడికి విద్య అందని ద్రాక్షలా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే పాఠ్యాంశాల్లో ఉన్న చరిత్రను తీసేసి విద్యార్థుల్లో మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ తప్పుదోవ పట్టిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవడానికి అవసరమైన "మౌలానా ఆజాద్ ఫెలోషిప్"ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి నిరంజన్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

మాట్లాడుతున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షులు నరసింహులు

తీర్మానాలు :

1) నూతన జాతీయ విద్యా విధానం-2020 రద్దు చేయాలి.
2) జిఒ 77ను రద్దు చేయాలి.
3) ధరలకు అనుగుణంగా మెస్ కాస్మొటిక్ చార్జీలు పెంచాలి. ప్రతి నెల పంపిణీ చేయాలి.
4) సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.
5) డోన్ నియోజకవర్గంలో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.నాగరాజు, యుటిఎఫ్ మాజీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, యుటిఎఫ్ జిల్లా నాయకులు లతీఫ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాం, మండల కార్యదర్శి ఏవి భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, మహిళా సంఘం జిల్లా నాయకురాలు షమీం బేగం, రైతు సంఘం మండల కార్యదర్శి నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

అభివృద్ధి ప్రతిపక్షాలకు కనపడడం లేదా..?

- మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలో చేస్తున్న అభివద్ధి ప్రతిపక్షాలకు కనపడడం లేదా.. ఇంత జరుగుతన్నా ఏమీ లేదని టిడిపి నాయకులు చెప్పడం విడ్డురంగా ఉందని, మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి టిడిపి నేతలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. మంగళవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వైఎస్ నగర్‌లో 1 కోటి 60 లక్షల అభివృద్ధి పనులను కౌన్సిలర్ సావిత్రమ్మ, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షులు టివి రమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలు ప్రారంభించారు. ముందుగా వైఎస్ నగర్‌లో రూ.80 లక్షలతో నిర్మించిన మెయిన్ డ్రైన్‌ను ప్రారంభించారు. అలాగే రూ.80 లక్షలతో చేపట్టే సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి జరగడంలేదని, కాకమ్మ కబుర్లు చెబుతున్నామని టిడిపి నాయకులు విమర్శించడం తగదన్నారు. వైఎస్ నగర్‌లో నూతనంగా ఒక కోటి 20 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మిస్తున్నామన్నారు. టిడిపి నాయకులు అవసరమైతే అభివృద్ధి పనులను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్మా నాగన్న, అంకాలయ్య, అన్వర్ బాషా, నరసింహ రావు, వెంకటస్వామి శెట్టి, బాబురావు, సోమశేఖర్, జాకీర్, కృష్ణ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న టిడ్కో లబ్ధిదారులకు విద్యుత్ మేళా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

టిడ్కో పట్టాలు పంపిణీ చేసిన 1024 టిడ్కో గృహాలకు నూతన విద్యుత్ మీటర్లకు ఈ నెల 27న గురువారం ఎస్ఆర్‌బిసి కాలనీలో ఏపీ ఎస్ పీడీసీఎల్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున టిడ్కో లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ మెంబర్లు, ఎపి స్టేట్ బోర్డు డైరెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

పట్టాలకు భూములు చూపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్
- వ్యకాసం ఆధ్వర్యంలో బిసిలు, దళితులు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

మిడుతూరు మండల కేంద్రంలోని దళితులు, బిసిలకు 1996 సంవత్సరంలో ఇచ్చిన పట్టాలకు భూములు చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టాలకు భూములు చూపాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మిడుతూరులో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను టి.రమేష్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. మిడుతూరులోని దళితులు, బిసిలకు 1996లో అలగనూరు పొలిమేరలో సర్వే నెంబర్ 26/2, 48, 376లలో పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని చెప్పారు. ఈ పాసు పుస్తకాలపై సొసైటీలో పంట రుణాలు కూడా తెచ్చుకున్నారని తెలిపారు. అయితే 27 సంవత్సరాల అవుతున్నా ప్రభుత్వం, అధికారులు భూములు చూపకపోవడం విచారకరమన్నారు. పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చిన దళితులకు భూములు చూపించాలని జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేయ, ఆర్‌డిఒలకు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. గతంలో నిరాహార దీక్ష చేసిన సందర్భంగా తహశీల్దార్ 15 రోజుల్లో భూములు చూపిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చూపకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ భూములు చూపేవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. దీక్షలో లింగమ్మ, శివ, లక్ష్మమ్మ, చెన్నమ్మ, వెంకటమ్మ, రాణమ్మ తదితరులు కూర్చున్నారు. కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.భాస్కర్ రెడ్డి, బక్రీద్, టి.ఓబులేష్, లింగస్వామి, శివుడు, రామిరెడ్డి, బాలకృష్ణ, రామకృష్ణ, స్థానికులు తిరుపాలు, రాముడు, సుజ్ఞానం, జయరాముడు, ఏసన్నలు పాల్గొన్నారు.

దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మాధవిలత

'బాల అకాడమీ'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాలాకాడమీ పాఠశాలలోని సిల్వర్ క్యాంపస్‌లో చిన్నారులకు మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎంజిబి రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవి లత మాట్లాడారు. విద్య ప్రాముఖ్యత, సమాజంలో విద్యకున్న గౌరవం, విశిష్టతను, క్రమశిక్షణ, సమయ పాలన గురించి చిన్నారులకు అర్థమయ్యేలా తెలియజేశారు. చిన్నారులందరూ బాగా చదువుకొని ఉన్నతమైన స్థానంలో ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిన రహదారి నిర్మాణం

- ఎమ్మెల్యే ప్రారంభించినా మోక్షం శూన్యం..
- ఇబ్బందుల్లో చిన్న గుమ్మడాపురం ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామానికి సిసి రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. గ్రామానికి రహదారి కోసం అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రజలకు నిరాశే మిగులుతోంది. గుంతలమయమైన రోడ్లపైనే గ్రామానికి వెళ్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిసి రహదారి కోసం పాలకుల చుట్టూ తిరిగారు. స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామానికి పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చినప్పుడు ఆత్మకూరు, సంగమేశ్వరం ప్రధాన రహదారి బస్టాండ్ నుంచి తారు రోడ్డు లేదా సిసి రోడ్డు నిర్మించాలని అర్జీలు అందజేశారు. ఫలితంగా గ్రామస్తుల కల నెరవేరింది అనుకుంటూ సంతోషంతో ఉన్న ప్రజలకు అర్థాంతరంగా రహదారి నిర్మాణం ఆగిపోవడంతో కలగానే మారింది.

ఆత్మకూరు-సంగమేశ్వరం ప్రధాన రహదారి బస్టాండ్ నుంచి చిన్న గుమ్మడాపురం గ్రామానికి ఆర్ అండ్ బి రోడ్డు మంజూరు అయింది. బస్టాండ్ నుండి చిన్న గుమ్మడాపురం వరకు దాదాపు 0.8 కిలోమీటర్ల రోడ్డును సుమారు 2 సంవత్సరాల క్రితం 66.70 లక్షల నిధులతో స్థానిక ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణ పనులు మెగా ఇంజనీరింగ్ కంపెనీ వాళ్లు చేసేందుకు ముందుకు వచ్చారు. రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే భూమి పూజ కూడా చేయడం జరిగింది. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లు పాత రోడ్డును తవ్వి కంకర మాత్రమే వేసి నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలేశారు. రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో గ్రామంలోకి ఆటోలు, వాహనాలు కంకర ఉన్న రోడ్డుపై రావాలంటే టైర్లు పంచర్లు అవుతున్నాయని, ఎవరూ గ్రామానికి రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామానికి రావాలన్నా, బయటకు పోవాలన్నా ఈ రోడ్డు ఒకటే మార్గం. ఆటోలు, మోటార్ సైకిళ్లు గ్రామంలోకి రాకపోవడం వల్ల రైతులు ఎరువులు, ఇతర సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం మధ్యలో ఆగిపోవడానికి నిధులు లేకపోవడమా..? కాంట్రాక్టర్లు వెనక్కి వెళ్లడమా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మధ్యలో ఆగిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నిలిచిపోయిన రహదారి పనులు

రహదారి నిర్మాణం పూర్తి చేయాలి

సంబంధిత అధికారులు స్పందించి మధ్యలో ఆగిన రహదారి నిర్మాణాన్ని పూర్తిగా చేపట్టాలి. రహదారి నిర్మాణం చేసేందుకు ముందుకు వచ్చిన సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి చెయ్యకపోవడం వెనక కారణం ఏమిటని ప్రశ్నించారు. గ్రామానికి అవసరాల నిమిత్తం ప్రజలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి.

- సిపిఎం నాయకులు స్వాములు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఇబ్బందులు తొలగించండి

మా గ్రామానికి రోడ్డు నిర్మాణం అందని ద్రాక్షలా మారింది. ఎంతో కాలం నుంచి లేకపోయిన రోడ్డు వచ్చిందన్న సంతోషం కొన్ని రోజులకే ఆవిరయింది. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం పూర్తి కావడం లేదు. వేసవికాలం పనులు లేకపోవడంతో పొలాల్లో గ్రామానికి వెళ్తున్నాం. వర్షాకాలం వచ్చిందంటే రైతులు పొలాల కోసం ఎరువులు, మందులు తెచ్చుకోవాలంటే తీవ్ర ఇక్కట్లకు గురి కావాల్సి వస్తుంది. అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి మధ్యలో ఆగిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ఆదుకోవాలి.

- రాజు, చిన్నగుమ్మడాపురం గ్రామస్తుడు.

అంగన్వాడీలకు గ్రాడ్యుటీని అమలు చేయాలి

- సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు గ్రాడ్యుటీని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మలు డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతూ మంగళవారం నంద్యాల పట్టణంలోని రూరల్ ప్రాజెక్టు దగ్గర అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిస్తూ గత సంవత్సరం ఏప్రిల్ 25న అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు గ్రాట్యూటీ అమలు చేయాలని చెప్పిందని, నేటికీ సంవత్సరం పూర్తి అవుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు అమలు, సామాజిక భద్రత పెన్షన్ అమలు చేయాలని గత అనేక సంవత్సరాలుగా యూనియన్‌గా ఆందోళన చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. నేటికీ సక్రమంగా నెల నెలా వేతనాలు రావడం లేదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్‌పై పని భారం పెంచి అతి తక్కువ వేతనాలతో పని చేయించుకుంటున్నారని చెప్పారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ జూనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి సమస్యలతో కూడిన మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో లలితమ్మ, సావిత్రి, శాంత కుమారి, సువార్తమ్మ, మరియమ్మ, మినీ అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు గ్రాడ్యుటీని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షెబారాణి, సిఐటియు జిల్లా నాయకులు వై.ఎల్లయ్య డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ మండల అధ్యక్షులు ఎస్ గుల్జార్‌బీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు విజయలక్ష్మి, శోభారాణి, సరస్వతి, లక్ష్మీదేవి ,సుబ్బలక్ష్మి, రాజేశ్వరి, భూలక్ష్మి, నారాయణమ్మ, విజయమని, దేవమణి, అనూష, సంతోషమ్మ, రామ తులసి, అరుణ, రమణమ్మ, హెల్పర్లు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు గ్రాట్యుటీ అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నందికొట్కూరులోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పద్మావతమ్మ అధ్యక్షత వహించారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఒ కోటేశ్వరమ్మకు వినతి పత్రాన్ని వినతిపత్రం అందజేశారు. సిఐటియు పట్టణ అధ్యక్షురాలు ఆర్ జయ, అంగన్వాడీ నాయకులు అరుణ ,జయంతి, సరస్వతి, అనసూయమ్మ, వరలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ : ఐసిడిఎస్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బేతంచెర్ల : తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు జి.షేబా రాణి, సిఐటియు జిల్లా నాయకులు వై.ఎల్లయ్య

క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న బిసి ఇందిరా

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బిసి ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి, థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బిసి ఇందిరా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లె గ్రామానికి చెందిన యువకులకు, అవుకు మండలం మన్నె నాయక్ తండా యువకులకు ఆమె క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో యువత పెడదారి పట్టకుండా క్రీడలపై దృష్టి సారించాలన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

శెట్టివీడులో శ్రమదానం

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని శెట్టివీడు గ్రామంలో వాసవీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రమదానం చేశారు. గ్రామంలో విద్యార్థులంతా కలసి గ్రామంలోని పురవీధుల్లోని చెత్తచెదారాన్ని తొలగించి పరిశుభ్రతకు పాటుపడ్డారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మహేశ్వరయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాబుద్దీన్, వాసవీ విద్యాసమాజం అధ్యక్షులు మదళ్లపల్లె సత్యనారాయణ, సభ్యులు పుల్లారెడ్డి, గుప్తా పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - బనగానపల్లె : మామిడి తోటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని యాగంటిపల్లె, జోలాపురం, బనగానపల్లెలో ఉన్న మామిడితోటలను ఆయన సందర్శించారు. 600 చెట్లు ఉన్న మామిడి పండ్లతోటను 32 లక్షల రూపాయలకు ఈ సంవత్సరం కాపునకు చెల్లించినట్లు మామిడి పండ్ల వ్యాపారి మహమ్మద్ ఖాజా తెలిపారు. ఖర్చులతో కలుపుకుని సుమారుగా 40 లక్షలు పెట్టుబడి అయ్యింద, నిఇప్పుడు 1 టన్ను మామిడి ధర 40 నుండి 60 వేల రూపాయలు వరకు ఉందన్నారు. కాపు సరిగా రాలేదని, దీంతో నష్టపోతున్నట్లు తెలిపారు. గాలి వానకు మామిడికాయలు రాలి తీవ్రంగా నష్టపోయినట్లు మామిడి రైతులు, కౌలు రైతులు, వ్యాపారులు చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ ఎంతో రుచికరమైన మామిడి పండ్లను దేశ ప్రజలకు అందిస్తున్న మామిడి రైతులను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు మండల ప్రధాన కార్యదర్శి జేవి. సుబ్బయ్య, వ్యాపారి రజాక్, రైతులు వి.పెద్దమద్దిలేటి, చిన్నమద్దయ్య, రంగడు, గిడ్డయ్య, నాగమద్దిలేటి, వికె. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కదం తొక్కుతూ.. ముందుకు సాగుతూ..

- కోసిగి మండలంలో లోకేష్ యువగళం
- మంత్రాలయం నియోజకవర్గంలోకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కోసిగి రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం మంత్రాలయం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఆదోని మండలం పెద్ద తుంబళం క్రాస్ విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నియోజకవర్గ ఇంచార్జీ పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. మంత్రాలయం నియోజకవర్గం గవిగట్టు, బాపులదొడ్డి క్రాస్, పేకలబెట్ట క్రాస్ మీదుగా కోసిగి వరకు సాగింది. కోసిగి యల్లమ్మ దేవాలయం సమీపంలో భోజన విరామం అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. బాపులదొడ్డి గ్రామస్తులు లోకేష్ ను కలిసి సమస్యలను విన్నవించారు. వాటర్ ట్యాంక్ పగిలిపోవడంతో, నీళ్ల సరిగా రావడం లేదని, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, బియ్యం పంపిణీ సక్రమంగా జరగడం లేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పీకలబెట్ట గ్రామస్తులు లోకేష్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని తెలిపారు. పులికనుమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ పులికనుమ ద్వారా రైతులకు సాగునీరందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోసిగి గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తాగునీటి సమస్య అధికంగా ఉందని, వ్యవసాయానికి సాగునీరు కూడా అందడం లేదని చెప్పారు. కోసిగిలో డిగ్రీ కళాశాల నిర్మించాలని కోరారు. నియోజక వర్గంలో నెలకొన్న విద్యా రంగసమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో ప్రత్యేక జూనియర్ జ్యుడీషియల్ కోర్టును, ఇండోర్ స్టేడియం నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పులికనుమ నుంచి కోసిగికి సాగు తాగు నిందించాలని ఏర్పాటు చేయాలని న్యాయవాదులు వినతి పత్రం అందజేశారు. బహిరంగ సభ తరువాత కోసిగి ఎల్లమ్మ దేవాలయంలో లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోసిగి పుర వీధుల్లో పాదయాత్ర సాగింది. లోకేష్‌ను చూసేందుకు జనం రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. కోసిగి శివారు విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. సమావేశంలో మాజీ కేంద్రమంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జీ పి.తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమిసెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు ఉలిగయ్య, ముత్తురెడ్డి, జ్ఞానేష్, దివాకర్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, సాయిబాబా, చెన్న బసప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిడి

ఉపాధి పనులను పరిశీలించిన ఎపిడి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని భానుముక్కల, బానకచర్ల గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఎపిడి అన్వర బేగం మంగళవారం పరిశీలించారు. కూలీల ఆన్లైన్ మస్టర్ను పరిశీలించారు. అనంతరం ఆమె కూలీలకు పలు సూచనలు చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే రూ. 250 వేతనం వస్తుందన్నారు. మేటీలు పని ప్రారంభించిన వెంటనే యాప్‌లో ఫస్ట్ ఫొటో తీయాలని, నాలుగు గంటల తర్వాత సెకండ్ ఫొటో తీసుకుని అప్లోడ్ చేసే విధానంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో విమలమ్మ, జేఈఈ రమేష్ నాయుడు, సిటిఏ స్వాములు, ఫీల్డ్ అసిస్టెంట్లు గోవిందు, సంజన్న పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వడదెబ్బకు నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల డాక్టర్ రాజకుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వడదెబ్బ వలన సంభవించే మరణాలను అరికడదామన్నారు. ఎండ తీవ్రత వలన శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందని, దీనివలన మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం(హైపోతలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురి అవుతారన్నారు. దీనినే సన్ స్ట్రోక్ అంటారన్నారు. ఇది ప్రమాదకరం, ప్రాణాంతకమన్నారు.

డిసిఎం బోల్తా - తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని లింగందిన్నె క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం డిసిఎం వ్యాన్ వేగంగా వెళుతూ టైరు పేలి బోల్తా పడింది. ఆ సమయంలో ఇతర వాహనాల రద్దీ తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. వ్యాన్‌లో ఉన్న బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి.

పెరుగుతున్న ఎండలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటూ అధికారుల హెచ్చరికలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతల వేడిమి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీల నుండి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటలకే ఉష్ణోగ్రతల వేడి పెరుగుతుండటంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమితో వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని, పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 11 గంటల లోపల ముగించుకోవాలని, ఆ తర్వాత బయట

తిరగరాదని సూచిస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహన సంస్థ పలు సూచనలు, సలహాలు చేసింది.

ఎండతీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

స్థానిక వాతావరణ సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలి. తలకు టోపి లేదా రూమాలు కట్టుకోవాలి. తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలి. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. వీలైనంత వరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించండి. తరుచుగా నీటిని తాగండి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఒఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలి. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. చల్లని నీరుతో స్నానం చేయండి.

ఎండ తీవ్రతంగా ఉన్నప్పుడు చేయకూడనివి..

ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. నలుపురంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు బయట పని చేయరాదు. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు బయట తిరగరాదు. ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటేడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రొటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలను తీసుకోవద్దు.

మాట్లాడుతున్న నాయకులు

మేడే కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - నంద్యాల

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే కరపత్రాలను ఐఎఫ్‌టియు నాయకులు మంగళవారం మంగళవారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం శంకర్ మాట్లాడుతూ దీర్ఘకాలం పోరాటాలు చేసి అమరులు సాధించిన కార్మిక చట్టాలను నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా విభజించడాన్ని కార్మిక లోకం ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి ఎస్ చౌడప్ప, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ మహమ్మద్,ఇర్ఫాన్ భాష, ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్ రఫీ, పఠాన్, కాజామియా తదితరులు పాల్గొన్నారు.

ఎపికి బిజెపి తీరని ద్రోహం : సిపిఎం

ప్రజాశక్తి - బేతంచర్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం, అన్యాయం చేసిందని, బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదింపుదామని సిపిఎం సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య, మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శి వైబి.వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని కొలుములపల్లె, బలపాలపల్లె గ్రామాలలో ప్రచార భేరి పాదయాత్ర కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర లాంటి ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ లాంటి హామీలలో ఏ ఒక్కటీ మోడీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్రానికి ఆయువుపట్టు లాంటి విశాఖఉక్కును ఆదానికో, జిందాల్ కో, మరో కార్పొరేట్ రాబందుకో కట్టబెట్టడానికి కుట్రలు చేస్తుందన్నారు. 2024లో జరుగు సార్వత్రిక ఎన్నికల్లో కార్మికులు, కర్షకులందరూ ఐక్యమై బిజెపి ప్రభుత్వాన్ని, ఆ పార్టీతో జతకట్టే పార్టీలను ఓడించాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.వెంకటరమణ, నాగరాజు, చిన్న వెంకటేశ్వర్లు, అంకాలు, యువరాజు, రవికుమార్, రాముడు, ఓబులేసు, సుబ్బరాయుడు, మద్దిలేటి, శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో ఉపాధి పనులను వారు పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫొటో యాప్ ద్వారా ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సిగ్నల్ ప్రాబ్లం ద్వారా కూలీలు వేతనాలు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఉపాధి కూలీలకు వేసవికాలంలో ఇచ్చే అలవెన్సును ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. రవాణా చార్జీలు, మెడికల్ కిట్టు, టెంటు, మజ్జిగ పనిచేసే చోట ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు భద్రత కల్పించడంలో విఫలమయ్యాయని అన్నారు. మే 15న జరిగే నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా నాయకులు బంగారం, సిఐటియు నాయకులు రత్నమయ్య, ఉపాధి కూలీలు, మేటీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

ఉచిత సామూహిక అభిషేకం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానంలోని చంద్రావతి కళ్యాణ మండపంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు సామూహిక ఉచిత అభిషేక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ లవన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ఉచిత సామూహిక సేవలు జరిపించుకునే అవకాశం నెలలో ఒకరోజు కల్పిస్తున్నట్లు తెలిపారు. 250 మందికి అవకాశం ఉంటుందని, ఆన్లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 12న అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించేందుకు సామాన్య భక్తులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆ తర్వాత భక్తులకు స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను, ప్రసాదాలను, శ్రీశైల ప్రభ పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానికులే కాకుండా హైదరాబాదు, కర్నూలు, అనంతపురం, గుంటూరు, ధర్మవరం, మార్కాపురం, చీరాల, నాగాయలంక తదితర ప్రాంతాల నుండి తెల్లరేషన్ కార్డు కలిగిన భక్తులు ఆన్లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకొని పాల్గొన్నారు.

సామూహిక ఉచిత అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం ఇఒ లవన్న

డాక్యు మెంట్ పోయినది

నంద్యాల పట్టణంలోని జగజ్జనని నగర్ కు చెందిన మహమ్మద్ ఆరిఫ్ అహ్మద్ షేక్ తండ్రి షేక్ మహబూబ్ సాహెబ్ పొలానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెంబర్ 1481/2009 పోయినది. ఎవరికైనా దొరికితే ఇవ్వగలరని మనవి.

షేక్ మహమ్మద్ ఆరిఫ్ అహ్మద్
సెల్ నంబర్ 8341633392

యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

పజాశక్తి - రుద్రవరం

యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్న కంబలూరు గ్రామంలో ఎర్రగుడిదిన్నె, రుద్రవరం జట్ల మధ్య సమ్మర్ యూత్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ప్రస్తుత తరుణంలో చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. చెడు వ్యసనాల నుండి బయటపడటానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు మంచి స్నేహితులు దగ్గరవుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ లాంటి క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నప్ప, కో ఆప్షన్ మెంబర్ మదర్ సాహెబ్, వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి, శివారెడ్డి, నిర్వాహకులు జంగా బాలేశ్వర్ రెడ్డి, తలారి రమేష్ పోషం భూపాల్ రెడ్డి, ఆదిమూలం పవన్ కుమార్, గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No.30/2022

మధుభాయ్ గారి ముహమ్మద్ ఇర్ఫాన్ ... వాది

V/s.

1. దండు చెన్నకేశవ
2. ఎస్. వెంకట సుబ్బారెడ్డి .... ప్రతివాదులు

To

ఎస్.వెంకటసుబ్బారెడ్డి, S/o S. చెంచి రెడ్డి, సత్రం వీధి, ఆళ్లగడ్డ. కర్నూలు జిల్లా. ప్రస్తుతం నంద్యాల జిల్లా.

దావా సమన్లు

పై నెంబరు కేసులో 2వ ప్రతివాది అయిన నీవు సమన్లు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 10-05-2023 వ తేదీన వేసియున్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 10/05/2023

ఇట్లు
ముహమ్మద్ కిరణ్
వాది తరపున న్యాయవాది,
కర్నూలు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మీరాపురం గ్రామంలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకి యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వైసీపీ నాయకులు మనోహర్ రెడ్డి, బండి జగదీశ్వర్ రెడ్డి తోట మల్లికార్జున రెడ్డి, బత్తుల రామ్మోహన్ రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం కష్టపడే ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని, 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి నాగేశ్వరమ్మ, ఎంపీడీవో శివరామయ్య, ఎంఈఓ స్వరూప, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, వెలుగు ఏపిఎం తిరుపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఇంజనీర్ రమణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, వైసిపి నాయకులు యమ్మనూరు నీలేశ్వర్ రెడ్డి, మదార్ సాహెబ్,ఈశ్వరయ్య,దేవ సహాయం, తిరుపాల్, సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో నీటి సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలం ప్రాజెక్టు : సున్నిపెంట కాలనీలో నెలకొన్న నీటి సమస్యను సొంత నిధులతో పరిష్కరిస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. శ్రీశైలం డ్యాం దిగువ భాగాన ఉన్న లింగాల గట్టులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం సున్నిపెంట కాలనీలో బ్రహ్మంగారి గుడి, ఆంజనేయస్వామి గుడి ఎదురుగా, పశువుల ఆసుపత్రి, బేతస్త చర్చి ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎక్కువగా నీటి సమస్యపై అందరూ అడుగుతున్నారని, అసలు ఇబ్బందులు ఎక్కడ వస్తున్నాయని కోణంలో అధికారులు అడిగి తెలుసు కున్నానని చెప్పారు. ప్రజలు ఇకమీదట నీటి సమస్యతో ఇబ్బందులు పడవలసిన అవసరం లేదని, సొంత నిధులు వెచ్చించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీలో నూతన వాటర్ ట్యాంకులు, పైపులైన్లు వేయించామన్నారు. గతంలో ఉన్న మోటార్లు గంటకు లక్ష లీటర్లు మాత్రమే డ్యామ్ నుండి ఫిల్టర్ హౌస్‌కు పంపిణీ చేసేవని, ప్రస్తుత ఆధునిక మోటర్లు గంటకు రెండు లక్షల లీటర్లు నీటిని పంపిణీ చేసేవి సొంత ఖర్చుతో ఏర్పాటు చేయిస్తానన్నారు. ఎంపీడీవో మోహన్ కుమారు, ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బంది, సచివాలయ, ఆర్డబ్ల్యూ సిబ్బంది, వాలంటీర్లు, మహిళా సంఘాలు, వైసిపి నాయకులు భరత్ రెడ్డి, వట్టి వెంకటరెడ్డి, ఎంఏ. రజాక్, ప్రవీణ్ తేజ, గుండయ్య యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయంలోనే నంద్యాల అభివృద్ధి : ఎమ్మెల్యే

నంద్యాల రూరల్ : నంద్యాల అభివృద్ధి వైసిపి ప్రభుత్వం హయంలోనే జరిగిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. లబ్ధిదారులను ఇంటి వద్దకు వెళ్లి వారికి వస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, సర్పంచ్ బాబమ్మ, ఎంపీటీసీ జమీరుద్దీన్ బి, ఎంపీటీసీ రంగారావు, చిన్నయ్య, హుస్సేన్, కాసిం, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ బలగాల మధ్య గడప గడప కార్యక్రమం

నంద్యాల టు జమ్మలమడుగు హైవేకు పేదల భూములలో చేస్తున్న సర్వేలకు వ్యతిరేకంగా గత కొద్దిరోజులుగా కానాల గ్రామ రైతులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకుంటారేమోనని ముందు జాగ్రత్తగా స్పెషల్ పోలీసు బలగాల మధ్య నిర్వహించారు.

బనగానపల్లె : సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

శ్రీశైలం ప్రాజెక్టు : మహిళకు సంక్షేమ పథకాల బుక్లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

నంద్యాల రూరల్ : బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 94/2022 IN O.S.No.30/2022

మధుభాయ్ గారి ముహమ్మద్ ఇర్ఫాన్ ... పిటీషనర్

V/s.

1. దండు చెన్నకేశవ
2. ఎస్. వెంకట సుబ్బారెడ్డి .... రెస్పాండెంట్స్

To

ఎస్. వెంకటసుబ్బారెడ్డి,S/o. S. చెంచిరెడ్డి, సత్రం వీధి, ఆళ్లగడ్డ. కర్నూలు జిల్లా, ప్రస్తుతం నంద్యాల జిల్లా.

2వ రెస్పాండెంట్ కు నోటీసు

పై నెంబరు కేసులో 2వ రెస్పాండెంట్ అయిన నీవు నోటీసులు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 10-05-2023 వ తేదీన వేసియున్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 10/05/2023

ఇట్లు
ముహమ్మద్ కిరణ్
వాది తరపున న్యాయవాది,
కర్నూలు.